# బతికుండగానే శ్మశానానికి!

- చావుబతుకుల మధ్య అభాగ్యుడు
- తీవ్ర అనారోగ్యంతో ప్రాణం మీదికి
- కిరాయి ఇంట్లోకి రానివ్వని యజమాని
- శ్మశానానికి తీసుకెళ్లిన పేద కుటుంబం



జగిత్యాల జిల్లా ధర్మపురి శ్మశానవాటికలో చావుబతుకుల నడుమ కొట్టుమిట్టాడుతున్న గోపి, దీనంగా రోదిస్తున్న కుటుంబసభ్యులు

ధర్మపురి, జూన్13 : చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఓ అభాగ్యుడిని కిరాయి ఇంట్లోకి యజమాని రానివ్వకపోవడంతో బతికుండగానే అతడిని కుటుంబసభ్యులు శ్మశానానికి తరలించిన హృదయ విధారక ఘటన జగిత్యాల జిల్లా ధర్మపురిలో స్థానికులను కలచివేసింది. పెద్దపెల్లి జిల్లా జూలపల్లి మండలం కుమ్మరికుంటకు చెందిన రంగు గోపి (45) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి పొట్టచేతపట్టుకొని ధర్మపురికి వచ్చాడు. 20 ఏండ్లుగా ఓ ఇంట్లో అద్దెకు ఉండి ధర్మపురిలోనే టిఫిన్ బండి నడుపుకొంటూ బతుకు నెట్టుకొచ్చాడు. ఇడ్లీ బండితో వచ్చిన ఆదాయంతోనే ఇద్దరు చెల్లెళ్ల పెండ్లి చేశాడు. కొద్ది నెలలుగా గోపి తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. చికిత్సకోసం అతడి చెల్లెళ్లు కరీంనగర్‌లోని ఓ దవాఖానలో చేర్పించారు. రెండు రోజులుగా అతడి శరీరం చికిత్సకు సహకరించడం లేదని, ఇంటికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో ఓ ప్రైవేటు వాహనంలో శుక్రవారం ధర్మపురికి తీసుకొచ్చారు. గోపిని ఇంట్లోకి తీసుకురావద్దని ఇంటి యజమాని తెగేసి చెప్పడంతో చేసేదేం లేక అక్కడి నుంచి నేరుగా శ్మశానవాటికకు తరలించారు. అక్కడే కర్మకాండల షెడ్డులో పడుకోబెట్టి కన్నీరుమున్నీరవుతున్నారు. బతికుండగానే గోపిని శ్మశానానికి తీసుకెళ్లడం స్థానికుల హృదయాలను ద్రవింపజేసింది.

## జస్టిస్ కే సురేందర్‌కు హైకోర్టు ఘనంగా వీడ్కోలు



హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): మద్రాస్ హైకోర్టుకు బదిలీ అయిన జస్టిస్ కే సురేందర్‌కు తెలంగాణ హైకోర్టు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ నేతృత్వంలో శుక్రవారం న్యాయమూర్తులు, న్యాయవాదులు మొదటి కోర్టు హాలులో సమావేశమై వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో జస్టిస్ సుజయ్‌పాల్, అడ్వొకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ జస్టిస్ కే సురేందర్ న్యాయవ్యవస్థకు చేసిన సేవలను కొనియాడారు. జస్టిస్ సురేందర్ 22,622 ప్రధాన కేసులను, 18,812 మధ్యంతర పిటిషన్లను పరిష్కరించారని తెలిపారు. సత్యం కేసు, దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసు, లుంబినీ పార్కు, గోకుల్‌చాట్ పేలుళ్ల కేసులో ఎన్ఐఏ తరపున వాదనలు వినిపించారని, ఇందులో దోషులకు శిక్ష పడిందని గుర్తుచేశారు. జస్టిస్ సురేందర్ మాట్లాడుతూ తనకు సహకరించిన సహచర న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# అగ్రిగోల్డ్ బాధితులకు గుడ్ న్యూస్

**కోర్టు ఆదేశాలతో సొమ్ము పంపిణీకి ఈడీ ఏర్పాట్లు**

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): అగ్రిగోల్డ్ బాధితులకు అతి పెద్ద ఊరట లభించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరాబాద్ జోన్ అధికారుల కృషితో లక్షల మంది ఖాతాదారులకు మేలు జరగనున్నది. 2018 నుంచి ఈడీ జప్తు చేసిన అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తులను బాధితులకు పంపిణీ చేయడానికి హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఈడీ అధికారులు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఈడీ జప్తు చేసిన ఆస్తులు మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.7 వేల కోట్లుగా అంచనా వేశారు. అగ్రిగోల్డ్ గ్రూప్ కంపెనీలు నడిపిన పొంజీ స్కీమ్ బాధితులకు త్వరలోనే సొమ్మును అందజేయనున్నట్టు తెలిపారు. సుదీర్ఘకాలంగా నిరీక్షిస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు ఈడీ ప్రకటనతో హర్షం వ్యక్తంచేస్తున్నారు.

## నారాయణతో మందకృష్ణ భేటీ

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణను ఆయన నివాసంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ భేటీ అయ్యారు. ఇటీవల పద్మశ్రీ అవార్డు స్వీకరించిన మందకృష్ణను నారాయణ అభినందించారు. ఎస్సీ వర్గీకరణ, బీసీలకు రిజర్వేషన్లు, కులగణనపై చర్చించారు.


**TATA INSTITUTE OF FUNDAMENTAL RESEARCH**
(Autonomous Institution of the Department of Atomic Energy, Government of India)
Survey No.36/P, Gopanpally Village, Serilingampally Mandal, Ranga Reddy District
Hyderabad - 500 046, Website: www.tifrh.res.in

**Extension of Due Date : Advt. No.2025/02**

Candidates may refer to the **Advt No. 2025/02** published on 24th May 2025 for recruitment of various posts. It is to inform that the due date for submission of online applications for the post mentioned therein is extended till **20th June 2025.** All other terms and conditions regarding age, qualifications, experience etc will remain the same. For details about Advt & application procedure candidates may visit **https://recruitment.tifrh.res.in/applicants/**

Head, Admin & Finance



**సెంటర్ ఫర్ హై ఎనర్జీ సిస్టమ్స్ అండ్ సైన్సెస్ (CHESS), హైదరాబాద్**

**అప్రెంటిస్‌ల నియామకం కొరకు ప్రకటన**

(1961, 1973 & 2014లో సవరించబడిన విధంగా, అప్రెంటిసెస్ యాక్ట్, 1961 యొక్క నిబంధనల క్రింద)

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ) క్రింద ఒక ల్యాబొరేటరీ అయిన సెంటర్ ఫర్ హై ఎనర్జీ సిస్టమ్స్ అండ్ సైన్సెస్ (CHESS), హైదరాబాద్ దిగువ తెలిపిన డిసిప్లిన్స్/ట్రేడర్స్‌లో ఒక సంవత్సరానికి అప్రెంటిస్‌ల నియామక ప్రక్రియ చేపడుతోంది:

| క్ర.సం. | అప్రెంటిస్‌షిప్ కేటగిరి | విద్యార్హతలు | మొత్తం ఖాళీలు | వేతనం (నెలకు ) |
|---|---|---|---|---|
| 1 | గ్రాడ్యుయేట్ (డిగ్రీ) అప్రెంటిస్ | కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో B.E/ B.Tech | 02 | 9,000/- |
| | | ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్/ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో B.E/ B.Tech | 03 | |
| | | మెకానికల్ ఇంజినీరింగ్‌లో B.E/ B.Tech | 03 | |
| | | కెమికల్ ఇంజినీరింగ్/ కెమికల్ టెక్నాలజీలో B.E/ B.Tech | 02 | |
| 2 | టెక్నీషియన్ (డిప్లొమా) అప్రెంటిస్ | కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో డిప్లొమా | 05 | 8,000/- |
| | | ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్/ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా | 04 | |
| | | మెకానికల్/ మాన్యుఫ్యాక్చరింగ్/ ప్రొడక్షన్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా | 05 | |
| | | కెమికల్ ఇంజినీరింగ్/ కెమికల్ టెక్నాలజీలో డిప్లొమా | 01 | |

**దరఖాస్తు చేసుకొను విధానం:**

1)అభ్యర్థులు 'వాట్స్ న్యూ' కాలమ్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవలెను మరియు నిర్ణీత నమూనాలో దరఖాస్తు ఫారంను పూర్తి చేయవలెను (వెబ్‌సైట్ **www.drdo.gov.in**లో లభించును). కనీస విద్యార్హతకు మద్దతునిచ్చే సర్టిఫికేట్స్, మెట్రిక్యులేషన్ సర్టిఫికేట్/ పుట్టిన తేదీని తెలిపే బర్త్ సర్టిఫికేట్, NOC (వర్తించినచో), కులం సర్టిఫికేట్ (వర్తించినచో)తో సహా సంతకంచేయబడిన దరఖాస్తు ఫారంను సింగిల్ PDF ఫైల్‌లో స్కాన్ చేయవలెను మరియు ముగింపు తేదీలోగా (hrd.chess@gov.in)కు ఇ-మెయిల్ చేయవలెను. ఇమెయిల్ ద్వారా తగువిధంగా పూర్తిచేయబడిన దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ ఎంప్లాయిమెంట్ న్యూస్/ రోజ్‌గార్ సమాచార్‌లో ఈ ప్రకటన ప్రచురణ తర్వాత 21 రోజుల వరకు. దరఖాస్తు అందనిచో/ పూర్తి చేయబడని దరఖాస్తు కొరకు CHESS, హైదరాబాద్ బాధ్యత వహించదు. పూర్తిచేయబడని/ పాక్షికంగా పూర్తి చేసిన దరఖాస్తులు తిరస్కరించబడును.

2)గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ (B.E/B.Tech) మరియు టెక్నీషియన్ అప్రెంటిస్ (డిప్లొమా) కొరకు అభ్యర్థులు నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ (NATS 2.0) పోర్టల్ **https://nats.education.gov.in**లో రిజిస్టర్ చేసుకోవల్సిందిగా సూచించడమైనది. రిజిస్టర్ చేసుకోని అభ్యర్థులు తిరస్కరించబడతారు.

డైరెక్టర్
డైరెక్టరేట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్

CBC 10301/11/0029/2526


**తిరగబడ్డ జనం**

## అత్తాకోడళ్లకు నిరసన సెగ

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డిపై స్థానికుల ఆగ్రహం
- ఒక్క దళితుడికీ ఇందిరమ్మ ఇల్లు రాలేదని మండిపాటు

తొర్రూరు, జూన్ 13: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం ఫతేపురంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఆమె అత్త, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డికి గ్రామస్థుల నుంచి నిరసనసెగ తగిలింది. పల్లెబాట, సీసీ రోడ్ల శంకుస్థాపనకు వారు శుక్రవారం ఫతేపురం రాగా, గ్రామంలో 21 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైతే ఒక్క దళితుడికీ ఇల్లు కేటాయించకపోవడంపై దళిత మహిళలు ఆగ్రహం వ్యక్తంచేశారు. 'పోలీసులను అడ్డం పెట్టుకొని ఎన్ని రోజులు తప్పించుకుంటారు? మాయమాటలు కట్టిపెట్టండి' అని మండిపడ్డారు. ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, ఝాన్సీరెడ్డి పోలీసుల భద్రత నడుమ హుటాహుటిన కారెక్కి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఫతేపురంలో 600 దళిత గడపలున్నా ఒక్కరికీ ఇల్లు ఇవ్వకపోవడం అవమానకరమని పేర్కొన్నారు. ఇళ్ల కేటాయింపులో వివక్షను తీవ్రంగా పరిగణిస్తామని, వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.



కారెక్కి వెళ్లిపోతున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, హనుమాండ్ల ఝాన్సీరెడ్డి

## రసాభాసగా రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ పర్యటన

- కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట
- గులాబీ పార్టీ నేత విజయ్‌తో పాటు పలువురి అరెస్టు

గద్వాల, జూన్ 13 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో శుక్రవారం తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి పర్యటన రసాభసాగా మారింది. సీడ్ కంపెనీలు, ఆర్గనైజర్ల చేతిలో నష్టపోతున్నారని సీడ్ పత్తి రైతులతో కలిసి బీఆర్ఎస్ రాష్ట్ర నేత కురువ విజయ్‌కుమార్ ఇటీవల హైదరాబాద్‌లో మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ తోపాటు రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి వినతిపత్రం అందించారు. స్పందించిన చైర్మన్ జిల్లాలో పర్యటనకు వచ్చారు. పుటాన్‌పల్లిలో కోటేశ్వర్‌రెడ్డి అనే రైతుతో కలెక్టర్ సంతోష్ మాట్లాడిన అనంతరం చైర్మన్.. పత్తి పంటను పరిశీలించగా కాంగ్రెస్ నాయకులు, అధికార పార్టీకి చెందిన సీడ్ ఆర్గనైజర్లు, రైతులతో మాట్లాడనివ్వకుండా వారే సమస్యలను వివరించారు. సమస్య ఉన్న చోటుకు వెళ్దామని చైర్మన్‌ను బీఆర్ఎస్ నేత విజయ్ కోరారు. దీంతో కాంగ్రెస్ నేతలు, విజయ్ మధ్య మాటలయుద్ధం కొనసాగింది. ఈ నేపథ్యంలో రెండువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకున్నది. పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేశారు. దీంతో చైర్మన్ పంట పొలాలను పరిశీలించకుండానే వెళ్లిపోయారు. కలెక్టరేట్‌కు చైర్మన్‌తో కలిసి విజయ్ వెళ్లే సమయంలో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకొని రేవులపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గొడవకు కారణమైన కాంగ్రెస్ నాయకులను మాత్రం వదిలిపెట్టారు. మల్దకల్ రైతును పోలీసులు మెడబట్టి వారి వాహనంలో తరలించారు.



జోగుళాంబ గద్వాల జిల్లాలో చైర్మన్ పర్యటనలో తోపులాడుకుంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు

## ఎమ్మెల్యేపై తిరగబడిన జనం

- యాకుత్‌పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్‌కు నిరసన సెగ
- సమస్యలు చెప్పుకుంటున్న జనంపై అనుచరుల దాడి
- స్థానికులు తిరగబడటంతో వెనుదిరిగిన ఎమ్మెల్యే

చార్మినార్, జూన్ 13: నియోజకవర్గంలో పర్యటిస్తూ స్థానిక సమస్యలను తెలుసుకునేందుకు ప్రయత్నించిన యాకుత్‌పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్‌పై జనం తిరగబడ్డారు. ఎమ్మెల్యే శుక్రవారం అనుచరులతో కలిసి మౌలాకా చిల్లా ప్రాంతంలో పర్యటించి అక్కడ జరుగుతున్న నాలా పనులను పరిశీలించారు. ఏండ్ల తరబడి పనులు జరుగుతుండటంతో వానొచ్చినప్పుడు వరదతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఎమ్మెల్యేను కలిసి నిలదీశారు. దీంతో కల్పించుకున్న ఆయన అనుచరులు స్థానికులపై తిరగబడ్డారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు దాడిచేసుకున్నారు. ప్రజల తిరుగుబాటుతో ఏం చేయాలో తెలియని ఎమ్మెల్యే అక్కడి నుంచి వెనుదిరిగారు.



ఎమ్మెల్యే అనుచరులపై దాడి చేస్తున్న స్థానికులు



హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆర్టీసీ జేఏసీ నేతలు

# ఒకే జేఏసీగా పోరాడుదాం

- ఆర్టీసీలో సమస్యలు పరిష్కరించుకుందాం
- కార్మిక సంఘాల సమావేశంలో నేతల పిలుపు

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీలోని అన్ని ట్రేడ్ యూనియన్లు ఒకే జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)గా ఏర్పడి సమస్యలపై పోరాడాలని నిర్ణయించాయి. సంఘాలు ఇటీవల వేర్వేరుగా సమావేశాలు నిర్వహించడంతో సమ్మె నోటీసులను ప్రభుత్వం తక్కువగా అంచనా వేసిందని అభిప్రాయపడ్డాయి. ఈ క్రమంలో వేర్వేరుగా ప్రభుత్వం చర్చలు జరిపి సమ్మెను నిర్వీర్యం చేసిందని, ఫలితంగా డిమాండ్లు సాధించుకోలేకపోయామని తెలిపాయి. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ సమావేశం చైర్మన్ ఈదురు వెంకన్న అధ్యక్షతన జరిగింది. జేఏసీ తరఫున అశ్వత్థామరెడ్డి, టీఎంయూ నుంచి రాజలింగం, ఎన్ఎంయూ నుంచి కమల్‌రెడ్డి, ఎస్‌డబ్ల్యూఎఫ్ నుంచి రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు సమావేశానికి హాజరయ్యారు. చైర్మన్ ఈదురు వెంకన్న, కో చైర్మన్ కే హనుమంతు ముదిరాజ్, వైస్ చైర్మన్ ఎం థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండీ మౌలానా, కో కన్వీనర్ కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బీ యాదగిరి మాట్లాడారు. ఇకపై అందరం కలిసి ఒకే ఎజెండాగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. దీనికి కార్మిక సంఘాలన్నీ సానుకూలంగా స్పందించాయి. ఈ నెల 24న మరో సమావేశం ఏర్పాటు చేసి ఉమ్మడిగా కార్యాచరణ ప్రకటిస్తామని ఆయా సంఘాల నేతలు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు బీ యాదయ్య, మీడియా ఇన్‌చార్జి పీ అప్పారావు, ఎం వెంకట్‌గౌడ్, ఎన్ కమలాకర్, గోలి రవీందర్, రహీమొద్దీన్, స్వాములయ్య, రాములు, రామ్‌చందర్, రాంరెడ్డి, ఏ జ్యోతి, మజీద్, బీ బాబు, కేఎస్‌పాల్, పాపయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఫీజుల సవరణా? తర్వాత చూద్దాం!'

- ఇంజినీరింగ్ కోర్సుల ఫీజులు పెంచాల్సిన అవసరం ఉన్నదా?
- విద్యాశాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- కళాశాలల తనిఖీ నివేదికలు బయటకు తీయాలని ఆదేశం



సీఎంను కలిసిన సీపీఆర్వో మల్సూర్

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): 'బీటెక్ ట్యూషన్ ఫీజులను పెంచాల్సిన అవసరం ఉన్నదా? అయినా ఆ విషయం తర్వాత చూద్దాంలే' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించినట్టు తెలిసింది. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం విద్యాశాఖపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు కాలేజీల వారీగా ప్రతిపాదిత ఫీజుల పెరుగుదల అంశాన్ని సీఎం ముందుంచారు. 'ఈ ఫీజులను తగ్గించాలి.. వర్కవుట్ చేద్దాం. విద్యార్థులు, తల్లిదండ్రులకు ఏ మాత్రం ఇబ్బందులు కలగొద్దు. ఈ ఫీజులపై తర్వాత చూద్దాం' అని పేర్కొన్నట్టుగా విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. గతంలో ఇంజినీరింగ్ కాలేజీలపై టాస్క్‌ఫోర్స్ కమిటీ, పోలీసుల తనిఖీ నివేదికలు ఏమయ్యాయి? అని ప్రశ్నించినట్టు తెలిసింది. ఆయా నివేదికలను బయటికి తీయాలని అధికారులను ఆదేశించినట్టు సమాచారం. విద్యాహక్కు చట్టం సెక్షన్ 12 (1)సీ ప్రకారం ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లు కేటాయించే అంశంపై, యంగ్ ఇండియా గురుకులాలపైనా ఈ సమావేశంలో చర్చ జరిగినట్టు అధికారవర్గాల ద్వారా తెలిసింది.

### అధికారులకు అక్షింతలు

సమీక్ష సందర్భంగా కొందరు అధికారులపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. సమీక్షకు సన్నద్ధమై రాకపోవడం, నివేదికలు, వివరాలను తీసుకురాకపోవడంతో సదరు అధికారులకు అంక్షితలేసినట్టు సమాచారం. ముఖ్యంగా బాగ్‌లింగంపల్లిలోని మైనార్టీ గురుకులానికి తాళాలేయడంతో టీచర్లు, విద్యార్థులు రోడ్డునపడ్డారు. ఈ విషయంపై ఆరా తీసిన సీఎం.. దీనిని తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని అధికారులను ప్రశ్నించినట్టు సమాచారం.

### కొత్తగా 571 స్కూళ్లు

రాష్ట్రంలో 20 మంది కన్నా ఎక్కువ పిల్లలున్న గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కొత్తగా 571 పాఠశాలలను ప్రారంభించనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. పట్టణీకరణ వేగంగా సాగుతున్న క్రమంలో పురపాలక శాఖతో సమన్వయం చేసుకుని హెచ్ఎండీఏ, మున్సిపల్ లేఅవుట్లలో కొత్త పాఠశాలలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియట్ వరకు గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యాసంస్థలను హేతుబద్ధీకరించాలని ఆదేశించారు. డే స్కాలర్లకు సైతం నాణ్యమైన భోజనం, గురుకులాల్లో కల్పిస్తున్న వసతుల కల్పనపై అధ్యయనం చేయాలని సూచించారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా తదతరులు పాల్గొన్నారు.

# మరో 4000 కోట్ల రుణానికి ఇండెంట్

- సెక్యూరిటీ బాండ్లను వేలానికి పెట్టిన ప్రభుత్వం
- 17న ఈ-వేలం ద్వారా తీసుకోనున్న సర్కారు

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): అప్పులను అలవాటుగా చేసుకున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మరో రూ.4,000 కోట్ల రుణసమీకరణ ఇండెంట్ పెట్టింది. 17న నిర్వహించే బహిరంగ వేలంలో అప్పు తీసుకుంటామని నాలుగు సెక్యూరిటీ బాండ్లను వేలానికి పెట్టింది. 33 ఏండ్ల కాలానికి రూ.1,000 కోట్లు, 34 ఏండ్ల కాలానికి రూ.1,000 కోట్లు, 35 ఏండ్ల కాలానికి మరో రూ.1,000 కోట్లు, 36 ఏండ్ల కాల పరిమితితో ఇంకో రూ.1000 కోట్లు తీసుకుంటామని తెలంగాణ ప్రభుత్వం సెక్యూరిటీ బాండ్లు పెట్టినట్టు శుక్రవారం రిజర్వ్ బ్యాంకు వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.14 వేల కోట్ల రుణం కోసం ఆర్బీఐకి రేవంత్ సర్కారు ప్రతిపాదనలు పంపించింది. కానీ, ఇప్పటికే ప్రతిపాదించిన మొత్తం తీసుకున్న ప్రభుత్వ అదనంగా రుణ సమీకరణ చేయబోతున్నది. ఈ ఆర్థిక సంవత్సరం మార్కెట్ రుణాల కింద రూ. 64,539 కోట్లు సమీకరిస్తామని బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

**ఈ ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ నుంచి ఈ-వేలం ద్వారా రేవంత్ సర్కారు తీసుకున్న అప్పు**

| | |
|---|---|
| ఏప్రిల్ 8న | రూ. 2000 కోట్లు |
| ఏప్రిల్ 15న | రూ. 1000 కోట్లు |
| ఏప్రిల్ 29న | రూ.1400 కోట్లు |
| మే 6న | రూ. 2000 కోట్లు |
| మే 13న | రూ. 2500 కోట్లు |
| జూన్ 3న | రూ.1500 కోట్లు |
| జూన్ 10న | రూ. 3000 కోట్లు |
| ఈ నెల 17న తీసుకోనున్న | రూ.4000 కోట్లు |
| మొత్తం | రూ.17,400 కోట్లు |

## మారుమూల గ్రామాల్లోని యువతకు టెక్ శిక్షణ. నెక్స్ట్ వేవ్ & ఎన్ ఎస్ డి సి కృషితో కొత్త అధ్యాయం



ఉత్తరప్రదేశ్ బాగ్‌పత్ జిల్లాలోని చప్రోలి అనే గ్రామంలో యువతకు కొత్త భవిష్యత్తు చూపిస్తూ ఒక పెనుమార్పు తెచ్చే విద్యా కార్యక్రమం మొదలైంది. నెక్స్ట్‌వేవ్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (NSDC) కలసి గ్రామీణ ఉత్తరప్రదేశ్‌లో టెక్ స్కిల్స్ నేర్పే ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించాయి. కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ అఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఆంట్రప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో గ్రామీణ మహిళా యువతకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు.

ఈ కార్యక్రమాన్ని చప్రోలిలోని చౌదరి చరణ్ సింగ్ ప్రభుత్వ మహావిద్యాలయంలో కేంద్ర మంత్రి శ్రీ జయంత్ చౌదరి గారు ప్రారంభించారు. అక్కడే 'ఫ్యూచర్ స్కిల్ ల్యాబ్' పేరుతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్కిల్ ఇండియా సెంటర్‌లో ఆధునిక టెక్నాలజీలపై ప్రాక్టికల్ శిక్షణ ఇస్తున్నారు. అక్కడి యువతలో మార్పు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. అక్కడ జాయిన్ అయిన విద్యార్థుల్లో చాలా మంది కంప్యూటర్ ఎప్పుడూ వాడలేదు. మొదటి రోజు ల్యాప్‌టాప్ ఆన్ చేయడం, కీబోర్డ్ ఎలా వాడాలో నేర్పించారు. ఇప్పుడు చూస్తే వారు వెబ్ యాప్స్ రూపొందించడం మొదలు పెట్టి టెక్ రంగంలో కెరీర్ దిశగా అడుగులు వేస్తున్నారు.

ఇక్కడ గమనించాల్సిన ఒక గొప్ప విషయం ఈ విద్యార్థుల పరిస్థితులు. వీళ్లంతా రైతు కుటుంబాల నుంచి వచ్చారు. ఉదయం 4 గంటలకే లేచి ఇంటి పనులు, పొలంలో పనులు పూర్తి చేసి, 5 నుంచి 10 కిలోమీటర్లు నడిచి స్కిల్ సెంటర్‌కు వస్తారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు క్లాసులు అటెండ్ అవుతారు. తర్వాత మళ్లీ ఇంటికి వెళ్లి వంట పనులు, ఇల్లు చూసుకోవాలి. అయినా 4.0 టెక్నాలజీస్‌ను పట్టుదలతో నేర్చుకుంటున్నారు.

ఒకప్పుడు బిడియంగా ఉంటూ ఎవరితోనైనా మాట్లాడాలంటే ఇబ్బంది పడే స్వాతి ఖోకర్ ఇప్పుడు కెరీర్ వైపు ధైర్యంగా ముందుకు అడుగులేస్తోంది. తండ్రిని కోల్పోయిన తర్వాత కుటుంబ బాధ్యతను తన భుజాలపై వేసుకుంది. ప్రస్తుతం కోడింగ్ నేర్చుకుంటూ, తాను మాత్రమే కాదు, తన వయసు అమ్మాయిలందరికీ ఆదర్శంగా మారింది.

నెక్స్ట్‌వేవ్ సీఈవో రాహుల్ అత్తులూరి మాట్లాడుతూ, "లక్షలాది మంది విద్యార్థులకు టెక్నాలజీ స్కిల్స్ నేర్పించడమే మా లక్ష్యం. వాళ్లు చక్కగా స్కిల్స్ నేర్చుకుని, మంచి కెరీర్ నిర్మించుకోవాలి. తమ కుటుంబాలు, దేశానికి ఉపయోగపడేలా ఎదగాలి. ఈ రోజు టెక్నాలజీలకే కాదు, రేపటి భవిష్యత్తుకి కూడా సిద్ధంగా ఉండేలా మేము తయారుచేస్తున్నాం" అన్నారు.

మొదట్లో వాళ్ళ పిల్లలు నేర్చుకోగలరా అని ఈ ప్రోగ్రాం పట్ల సందేహంగా ఉన్న తల్లిదండ్రులే ఇప్పుడు పెద్ద ఎత్తులో మద్దతు ఇస్తున్నారు. తమ పిల్లలు కోడ్ రాయటం, వెబ్ యాప్‌లు రూపొందించటం, నేర్చుకున్న విషయాల గురించి ధైర్యంగా మాట్లాడటం చూసి వాళ్ల నమ్మకాలే మారిపోయాయి. ఈ స్కిల్ సెంటర్ పై చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా ఆసక్తి పెరుగుతోంది. ఇప్పటికే తదుపరి బ్యాచ్‌లో చేర్చుకోమని 25 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. చౌదరి చరణ్ సింగ్ ప్రభుత్వ మహావిద్యాలయం ప్రిన్సిపాల్ డా. ప్రతీత్ దహియాకు ఇది ఒక పెద్ద లక్ష్యానికి మొదటి అడుగులాగా కనిపిస్తోంది. "ఈ కళాశాల భారత రత్న చౌదరి చరణ్ సింగ్ గారి పేరు మీద ఉంది," అని చెప్పారు. "ఆయన ఎప్పుడూ దేశం అభివృద్ధి బాటలో సాగాలంటే అది గ్రామాల నుంచి జరగాలి' అని చెప్పేవారు. గ్రామీణ పిల్లలకు టెక్నాలజీ స్కిల్స్ ఉండాలన్నది ఆయన కల. ఇప్పుడు ఆ కల నిజమవుతుండడం ఆనందంగా ఉంది."

గ్రామీణ భారతంలో పాత పద్ధతుల విద్యపై ఆదరణ తగ్గుతూ, స్కిల్స్‌తో కూడిన ప్రాక్టికల్ లెర్నింగ్ పట్ల ఆసక్తి పెరుగుతోంది. ఆ మార్పునే ఈ ప్రోగ్రామ్ ప్రతిబింబిస్తోంది. నెక్స్ట్‌వేవ్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ విద్యార్థులకు కోడింగ్ మాత్రమే కాకుండా, కమ్యూనికేషన్, టీం వర్క్, సమస్యల పరిష్కారం, ప్రాజెక్ట్ ప్రాక్టీస్ ఇలా ఇండస్ట్రీ కి అవసరమైన అనేక నైపుణ్యాలు నేర్పిస్తోంది. భాష సమస్యను ఎదుర్కొంటున్న విద్యార్థులకు మెంటర్లు ఏఐ టూల్స్ ద్వారా వర్నాక్యులర్ సపోర్ట్ ఇవ్వడమూ ఓ పెద్ద ముందడుగు. కేవలం 6 నెలల్లోనే ముగ్గురు విద్యార్థులు ఉద్యోగాలు పొందడం వల్ల, గ్రామీణ యువతలో ఎంత వేగంగా టాలెంట్ వెలికి తీయవచ్చో స్పష్టమవుతోంది. మొదట్లో కేవలం 30 మంది విద్యార్థులతో ప్రారంభమైన ప్రోగ్రాం, ఇప్పుడు చుట్టుపక్కల గ్రామాలనంతా తాకుతోంది. NSDC, స్థానిక నేతల మద్దతుతో నగరాల్లో మాత్రమే ఉండే అవకాశాల్ని గ్రామీణ యువతకు అందించేందుకు నెక్స్ట్ వేవ్ వేగంగా ముందుకెళ్తోంది. అవకాశం దరిచేరదు అనిపించిన గ్రామాల్లో ఇప్పుడు కొత్త ఉద్యమం మొదలైంది. ఈ కార్యక్రమం కేవలం శిక్షణ ఇవ్వడం మాత్రమే కాదు, విద్యార్థులలో, కుటుంబాల్లో, గ్రామీణ భారత్ భవిష్యత్తు నిర్మాణం చేయగలదు అన్న విశ్వాసాన్ని మళ్లీ చేకూర్చడం దీని అసలైన లక్ష్యం.


NxtWave Institute of Advanced Technologies
కపిల్ కావూరి హబ్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నానక్‌రామ్‌గూడ, తెలంగాణ, 500032